

విద్యార్థులతో స్వచ్ఛత సేవ ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి

స్వచ్ఛత సేవ పై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత సేవ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా తడి-పొడి చెత్త, హానికర చెత్తను వేరు చేసే విధానంతో పాటు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వచ్ఛత పాటించాలన్నారు. తడి-పొడి చెత్తను వేరుగానే ఇంటికి వచ్చే రిక్షాలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందంతో పాటు శానిటరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ జంగం శ్వేత

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: శ్వేత

సైదాబాద్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): ఐఎస్ సదన్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి అన్నారు. గురువారం సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీకి వరదనీటి ముంపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డివిజన్‌లో పాడైన రోడ్ల మరమ్మతులు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కేఆర్‌సీరెడ్డి, సర్వేశ్వర్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, కేఎస్‌ఎన్‌రెడ్డి, వెంకట రమణ, యాదగిరి పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ మహిళ అవయవ దానం



అన్నపూర్ణ విశాలక్ష్మి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వృద్ధురాలి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంకు చెందిన కౌత అన్నపూర్ణ విశాలక్ష్మి(62) గృహిణి. ఈనెల 5న ఇంటి వద్ద ఆమె బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైంది. వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో కోమాలోకి వెళ్లినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా ఈనెల 16న ఆమె మృతిచెందింది. గతంలో ఆమె అవయవాలు దానం చేస్తానన్న అంగీకారం ప్రకారం కుటుంబ సభ్యులు అన్నపూర్ణ విశాలక్ష్మి కిడ్నీలు, లివర్‌ను జీవన్‌ధాన్ ద్వారా ఆస్పత్రికి అప్పగించారు.



తేజస్వినిని శాలువాతో సన్మానిస్తున్న చీకోటి ప్రవీణ్

ఇండియా స్కేటింగ్ టీంకు తేజస్విని ఎంపిక సంతోషకరం : చీకోటి ప్రవీణ్

మన్సూరాబాద్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): స్కేటింగ్ విభాగంలో ఇండియా టీంకు మన్సూరాబాద్ డివిజన్‌కు చెందిన సరబ్ అంజిబాబు, శిరీష దంపతుల కుమార్తె తేజస్విని ఎంపికైంది. మన్సూరాబాద్‌లోని వారి నివాసంలో గురువారం తేజస్వినిని కలిసిన బీజేపీ నాయకుడు చీకోటి ప్రవీణ్ శాలువాతో సన్మానించి సంతోషం వ్యక్తం చేశారు. తేజస్విని మున్ముందు స్కేటింగ్ విభాగంలో ప్రపంచ దేశాలకు గట్టి పోటీనిస్తూ దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు మొరిశెట్టి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్లు మారుమూల ప్రాంతాలకు న్యాయసేవలు అందించాలి : జడ్జి శ్రీదేవి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లు మారుమూల ప్రాంతాలకు న్యాయసేవలు అందించాలని రంగారెడ్డి జిల్లా కోర్టుల సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా కోర్టులోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో పారా లీగల్ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. పారా లీగల్ వలంటీర్లు ప్రతి ఒక్కరికీ న్యాయసేవలు అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. కేసుల పరిష్కారంలో ప్రముఖ పాత్ర వహించాలన్నారు. సమావేశంలో పారాలీగల్ వలంటీర్లు అరుణ, విజయలక్ష్మి, రజనీదేవి, సంజీవ, వాల్‌రెడ్డి, శ్రీనివాస్‌కుమార్, శ్రీదేవి, మనిరాణి పాల్గొన్నారు.

తొర్రూర్‌లో ఎర్రకుంట అలుగు పంచాయితీ

- తమ పొలం గుండా అలుగు తీయడానికి కుట్ర చేస్తున్నారని ధర్నాకు దిగిన రైతు కుటుంబం
- అలుగులేక తమ పొలాలు నీట మునుగుతున్నాయని చెరువు పై రైతుల నిరసన

హయత్‌నగర్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లోని ఎర్రకుంట అలుగు పంచాయితీ రోజురోజుకు ముదురుతుంది. ఉద్దేశపూర్వకంగా తమ పొలం గుండా అలుగు తీయడానికి కుట్ర చేస్తున్నారని, అందులో భాగంగానే తమ పొలం వద్ద రోడ్డుకు అడ్డంగా కల్వర్టు నిర్మిస్తున్నారని ఆరోపిస్తు గ్రామానికి చెందిన చినింగి భిక్షపతి కుటుంబ సభ్యులు పొలం వద్ద గురువారం ధర్నాకు దిగారు. ఇదిలా ఉండగా ఎర్రకుంట అలుగును మూసి వేయడం వల్ల తమకు చెందిన పొలాలు మొత్తం నీట మునిగి పంటకు పనికి రాకుండా పోతున్నాయంటూ చెరువు పై ప్రాంతంలోని రైతులు నిరసనకు దిగారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టు నిర్మిస్తున్న చోట అలుగు లేదని కొందరు గ్రామస్థులు అంటుండగా, మరికొందరు మాత్రం ఇక్కడే ఉండేదని దానిని పూడ్చి పై నుంచి బ్రాహ్మణపల్లి గ్రామానికి వెళ్లె రోడ్డును వేశారని మరికొందరు అంటున్నారు. అధికార బలాన్ని ఉపయోగించి చెరువు ఎఫ్‌టీఎల్‌ను తగ్గించేందుకు కొందరు పెద్ద మనుషులు కుట్ర చేస్తున్నారని భిక్షపతి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గ్రామ నక్షా, టోపోషిట్ ప్రకారం అలుగు తీస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అంటున్నారు. మా భూమిని విక్రయించాలని ఒత్తిడి తెస్తున్నారని భిక్షపతి తెలిపారు. కాలువ ద్వారా చెరువులోకి నీరు రాకుండా తమ పొలం గుండా నీరు కిందకు పంపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మూడు సంవత్సరాలుగా వేధిస్తున్నారని అన్నారు.



కల్వర్టు నిర్మాణానికి తవ్వుతున్న దృశ్యం



బయట పడ్డ అలుగుగోడ

ఇరిగేషన్, రెవెన్యూ అధికారులే అలుగు గుర్తించారు

అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఇరిగేషన్, రెవెన్యూ అధికారులే అలుగును గుర్తించారని ఎర్రకుంట పైన ఉన్న రైతులు తెలిపారు. అలుగు చూపించిన చోటనే ఆర్‌అండ్‌బీ అధికారులు కల్వర్టు నిర్మిస్తున్నారని రైతులు తిరుపతి రెడ్డి, రమేష్, ఎల్లేష్, మాధవరెడ్డి, మహేందర్‌రెడ్డిలు తెలిపారు. ఎఫ్‌టీఎల్ ఏర్పాటు చేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని తెలిపారు. చెరువు నిండి తెగిపోయె ప్రమాదం ఏర్పడినందు వల్లనే అలుగు తీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.



తొర్రూర్- బ్రాహ్మణపల్లి రోడ్డులో నిర్మిస్తున్న కల్వర్టు వద్ద ధర్నాకు దిగిన రైతు భిక్షపతి కుటుంబ సభ్యులు

బయట పడ్డ అలుగు..?

కల్వర్టు నిర్మిస్తున్న ప్రాంతంలో జేసీబీతో తవ్వగా అలుగు గోడ బయట పడింది. దీంతో ఎర్రకుంట పైన ఉన్న రైతుల వాదనకు బలం చేకూరింది. అయితే భిక్షపతి కుటుంబ సభ్యులు మాత్రం అది అలుగు గోడ కాదని రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కట్ట బలహీనంగా ఉందని నిర్మించిన కట్టడం అని అంటున్నారు. వాస్తవాలు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తేల్చాల్సి ఉంది.

గణేశ్ నవరాత్రుల్లో పారిశుధ్య సిబ్బంది సేవలు భేష్

- ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రశంసలు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రుల సందర్భంగా క్రమం తప్పకుండా విధులు నిర్వర్తించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పని చేశారని, వారి సేవలు ప్రశంసనీయమని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా చెరువు వద్ద చెత్తా చెదారం తొలగింపులో, వీధులను శుభ్రం చేయడంలో వారు ఎంతో శ్రమపడ్డారని ఆమె అన్నారు. గురువారం మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన పారిశుధ్య సిబ్బందికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సబితారెడ్డి పాల్గొని వారిని శాలువాతో సత్కరించారు. ఆమె మాట్లాడుతూ మీర్‌పేట్ కార్పొరేషన్‌ను నిరంతరం పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేయాలని పారిశుధ్య సిబ్బందికి, మునిసిపల్ అధికారులకు సూచించారు.



మీర్‌పేట్ పారిశుధ్య సిబ్బందితో ఎమ్మెల్యే సబితారెడ్డి

కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ చంద్రప్రకాశ్, కార్పొరేటర్లు, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను గురువారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ఎంతగానో తోడ్పడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ సర్జరీ సదస్సులో ప్రొఫెసర్ లక్ష్మి

ఉస్మానియా ప్రొఫెసర్‌కు పురస్కారం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): కొయంబత్తూరులో నిర్వహిస్తున్న జాతీయ ప్లాస్టిక్ సర్జరీ సదస్సులో ఉస్మానియా ఆస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్ పలుకూరి లక్ష్మికి మెంటర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం అందజేశారు. దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ సర్జరీ వైద్య విద్యార్థుల కోసం క్లినిక్‌లో ప్లాస్టిక్ ఛాలెంజ్ ఫైనల్స్‌ను నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ లక్ష్మి విద్యుత్‌ఘాతం వల్ల కాలిన గాయాలకు చికిత్స అందించడం, వాటిని పునర్నిర్మించడం, ఎలా యానిమేట్ చేయడం వంటి అంశాలపై తన అనుభవాలను వివరించారు. ఉస్మానియా ఆస్పత్రిలో బాధితులకు అందించిన చికిత్స వివరాలను చెప్పారు. ఈ చికిత్సలో కోలుకుని సాధారణ జీవనం గడుపుతున్న వారి వివరాల వీడియోలను చూపించారు. పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఆమె సభ్యురాలిగా ఎంపికైంది. కార్యక్రమంలో ఎయిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రోహిత్కుల, ఉస్మానియా నుంచి వైద్య విద్యార్థులు సందీప్‌రెడ్డి, స్వాతి, శంకర్, అజోలు ప్లాస్టిక్ ఛాలెంజ్‌లో పాల్గొన్నారు.

23న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

- భవన నిర్మాణ కార్మిక సంఘాల ఐక్యవేదిక

బర్కత్‌పుర, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దని, ప్రభుత్వమే బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలను అందజేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత అంగవైకల్యం, పాక్షిక అంగవైకల్యం తదితర నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి తమ బాధ్యతల నుంచి తప్పుకోవాలని ప్రయత్నిస్తుందని, ఈ నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు, గౌరవ అధ్యక్షుడు ఓంగోలు రాములు, తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అనుమోష్, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అనురాధ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలయ్య, స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, కుమార్, తెలంగాణ రాష్ట్ర భవన ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఇ.చిన్నారావు మాట్లాడారు. ఈనెల 23న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించి లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. వెల్ఫేర్ బోర్డు అడ్వయిజరీ కమిటీని నియమించి నిధులు దారి మళ్లకుండా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్రమంత్రి బండిని కలిసిన బాలాపూర్ శంకర్‌రెడ్డి

- మోదీకి లడ్డూ ప్రసాదం ఇవ్వడానికి అపాయింట్‌మెంట్ తీసుకోవాలని వినతి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ లడ్డూను వేలంలో రూ.30.01లక్షలకు సొంతం చేసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి గురువారం కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి ఆయనను అభినందించి బాలాపూర్ లడ్డూ ప్రాశస్త్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా వేలంలో దక్కించుకున్న బాలాపూర్ లడ్డూ ప్రసాదాన్ని ప్రధాని మోదీకి ఇవ్వాలని నిర్ణయించుకున్నానని, ఇందుకుగాను పీఎం అపాయింట్‌మెంట్ తీసుకోవాలని శంకర్‌రెడ్డి బండిని కోరగా, త్వరలోనే అపాయింట్‌మెంట్ తీసుకుని ఢిల్లీకి తీసుకువెళ్తానని బండి హామీ ఇచ్చారు.



బండి సంజయ్‌ను కలిసిన శంకర్‌రెడ్డి

సోమవారం నుంచి లడ్డూ పంపిణీ

తాను వేలంలో పొందిన బాలాపూర్ లడ్డూ ప్రసాదాన్ని సోమవారం నుంచి బంధుమిత్రులకు, గ్రామ ప్రజలకు, భక్తులకు పంపిణీ చేయనున్నట్లు శంకర్‌రెడ్డి తెలిపారు. మోదీకి ఇవ్వగా మిగిలిన లడ్డూలో కలపడానికి మరో వంద కిలోల లడ్డూను ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నానని, దానిని ప్యాక్ చేసి అందరికీ అందజేస్తానని ఆయన పేర్కొన్నారు.

రాజీవ్‌గాంధీ పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- వాకర్స్ అసోసియేషన్

వనస్థలిపురం, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్‌గాంధీ పార్కులో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని రాజీవ్‌గాంధీ పార్కులో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ నిత్యం వందలాది మంది వచ్చే ఈ పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చిన ఫలితం లేదన్నారు. ముఖ్యంగా వీధి దీపాలు, టాయిలెట్స్, డ్రైనేజీ, చిల్డ్రన్స్ ఆట వస్తువులు తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

తాము టికెట్ డబ్బులు ఖర్చుపెట్టుకుని పార్కులోకి వచ్చినా కూడా పార్కులో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తమకు పార్కుకు రావాలంటేనే ఇబ్బందికరంగా ఉందన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రాజీవ్‌గాంధీ పార్కులో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సలహాదారులు మల్లారెడ్డి, అధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, అశోక్‌కుమార్, శ్రీరాములు, ఆలేటి ఎల్లయ్య పాల్గొన్నారు.

నిమజ్జన ఊరేగింపులో వివాదం.. మహిళలపై దాడి

- ఏసీపీ తీరును నిరసిస్తూ పోలీస్‌స్టేషన్ ఆవరణలో దళిత సంఘాల ఆందోళన
- ముగ్గురు బీఆర్‌ఎస్ నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ఊరేగింపులో రెండు మండప నిర్వాహకుల నడుమ తలెత్తిన వాగ్వాదం దాడికి దారితీసింది. మహిళలపై బీఆర్‌ఎస్ నాయకుడు తన అనుచరులతో కలిసి దాడి చేయడంతో ఓ మహిళ గాయాలపాలైన సంఘటన బుధవారం అర్ధరాత్రి సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు దాడి చేసిన వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తూ దళిత సంఘాల ప్రతినిధులు సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సంఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ చెరుకుతోటకాలనీ దళిత బస్తీలో అఖిల్ బృందం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుని నిమజ్జన ఊరేగింపు బుధవారం రాత్రి ప్రారంభించారు. చెరుకుతోటకాలనీ నుంచి సంస్కృతి పాఠశాల ముందు నుంచి నేతాజీనగర్, కృష్ణవేణినగర్‌కాలనీ వీధుల నుంచి దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారికి నిమజ్జన వాహనాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తున్నారు. అయితే కృష్ణవేణినగర్ కాలనీలోని అరబిందో డిగ్రీ కళాశాల ఎదురుగా తరుణ్, ప్రతీక్ స్నేహితుల బృందం గణనాథుని మండపాన్ని ఏర్పాటు చేశారు. అయితే వారు కూడా బుధవారం రాత్రి నిమజ్జన ఊరేగింపును చేపట్టారు.

పోలీసులతో మాట్లాడుతుండగా వాగ్వాదానికి దిగిన జక్కిడి బృందం

సుమారు అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో చెరుకుతోట గణనాథుని ఊరేగింపు అరబిందో డిగ్రీ కళాశాల సమీపానికి చేరుకుంది. అయితే ఆ సమయంలో అక్కడ డీజేతో ఉన్న ప్రతీక్‌బృందం గణనాథుని విగ్రహ ర్యాలీ ముందు ఆ వాహనం వెనుక మిగతా వాహనాలు ఉన్నవి. వెనుక ఉన్నటువంటి చెరుకుతోట కాలనీ నిమజ్జన వాహనాన్ని పోలీసులు ముందుకు పంపించి మెయిన్‌రోడ్డుకు తరలిస్తున్నారు. దీంతో చెరుకుతోట మండప నిర్వాహకులు మా ముందు ఉన్నటువంటి విగ్రహాన్ని పంపకుండా, కేవలం మా ఊరేగింపును మాత్రం హుటాహుటిన ఎందుకు పంపిస్తున్నారని పోలీసులను ప్రశ్నించారు. ఇది గమనించిన ప్రతీక్ స్నేహితుడు బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి బృందం అక్కడకు చేరుకుని మా విగ్రహం గురించి మీరు ఎందుకు అడుగుతున్నారంటూ చెరుకుతోట మండప నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరు మండప నిర్వాహకుల నడుమ మాటామాట పెరిగింది. జక్కిడి రఘువీర్‌రెడ్డి చెరుకుతోట మండప నిర్వాహకులపై దాడికి దిగడంతో ఇద్దరు మహిళలు, మరో యువకుడు గాయపడ్డారు. గొడవ సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తన సిబ్బందితో చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టి, అక్కడి నుంచి పంపించి వేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు స్వరూప



స్టేషన్ ఆవరణలో ఆందోళన చేస్తున్న బేర బాలకిషన్ బృందానికి నచ్చజెబుతున్న ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బైఠాయించి, ఆందోళన

చెరుకుతోట మండప నిర్వాహకులు తమపై దాడి చేశారంటూ రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం వరకు గాయపడిన మహిళకు చికిత్స చేయించకుండా, కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటూ బాధితులు గురువారం ఉదయం సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ స్టేషన్‌కు చేరుకుని దళిత మహిళలపై దాడికి దిగి, గాయపరిచిన బీఆర్‌ఎస్ నేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, అతని అనుచరులపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్యకు ఫోన్‌చేశారు. అయితే ఏసీపీ మీకు ఏమి పనిపాట లేదు.. ఫోన్ పెట్టేయండి అని అవమానపరిచే రీతిలో నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆరోపిస్తూ బేర బాలకిషన్, దళిత సంఘాల ప్రతినిధులు, బాధితులు సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బైఠాయించి ఆందోళనకు దిగారు. దళితులు ఫిర్యాదు చేసేందుకు ఫోన్ చేస్తే చులకనగా మాట్లాడడం సరైన పద్ధతి కాదంటూ.. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ స్టేషన్‌కు చేరుకుని బాధితులకు న్యాయం చేసి, దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని ఆందోళనకారులకు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. గాయపడిన స్వరూప అనే బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితులు స్వరూప, మాలతి తమపై దాడికి పాల్పడిన వారిపై ఫిర్యాదు చేశారు. దీంతో సరూర్‌నగర్ పోలీసులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, విజయ్, ప్రతీక్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.



అల్మాస్‌గూడ శ్రీరామాంజనేయ భక్త భజన మండలి లడ్డూను రూ.4.20లక్షలకు దక్కించుకున్న రామిడి కృష్ణారెడ్డి



మీర్‌పేట్ ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్‌కాలనీ లడ్డూను రూ.1.38లక్షలకు సొంతం చేసుకున్న కేశవాచారి దంపతులు



అల్మాస్‌గూడ శ్రీశ్రీ హోమ్స్ లడ్డూను రూ.3.65లక్షలకు కైవసం చేసుకున్న సామ నవీన్‌రెడ్డి

పోటాపోటీగా లడ్డూల వేలం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): గణేశుడి లడ్డూ వేలం పాటలు పోటాపోటీగా కొనసాగుతున్నాయి. బుధ, గురువారాల్లో పలు ప్రాంతాల్లో నిర్వహించిన గణేశ్ నిమజ్జనోత్సవాల్లో భాగంగా లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. ఈ క్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలో శ్రీరామాంజనేయ భక్త భజన మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని బుధవారం రాత్రి పొద్దుపోయాక స్థానిక కోమటికుంట చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని వేలంవేయగా భజన మండలి చైర్మన్ రామిడి కృష్ణారెడ్డి రూ.4.20లక్షలకు కైవసం చేసుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.



కుంట్లూర్ గణేశ్‌నగర్ కాలనీలో లడ్డూను రూ. 1.53 లక్షలకు దక్కించుకున్న పడమటి శ్రీనివాస్‌రెడ్డి

శ్రీశ్రీ హోమ్స్ లడ్డూ ధర రూ.4.20లక్షలు

అల్మాస్‌గూడలోని శ్రీశ్రీ హోమ్స్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని గురువారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా లంబోదరుడి లడ్డూను వేలం వేయగా స్థానిక భక్తుడు, 'ఏకం' కంపెనీ అధినేత సామ నవీన్‌రెడ్డి రూ.3.65లక్షలకు సొంతం చేసుకున్నారు.

ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీలో రూ.1.38లక్షలు

మీర్‌పేట్ కార్పొరేషన్ 36వ డివిజన్‌లోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడిని బుధవారం రాత్రి స్థానిక మంత్రాలచెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా మైలవరం కేశవాచారి రూ.1.38లక్షలకు దక్కించుకున్నారు. స్థానిక కార్పొరేటర్ యెడ్ల మల్లేశ్‌ముదిరాజ్ ఆయనకు లడ్డూ ప్రసాదం అందజేసి సన్మానించారు.



హనుమాన్ యువసేన వారి లడ్డూను రూ 77,116 లకు కైవసం చేసుకున్న చండూరి నరేష్

రూ. 77,116 లు పలికిన లడ్డూ

కొత్తపేట: కొత్తపేట బీజేపీ కార్యాలయంలో హనుమాన్ యువసేన ఆధ్వర్యంలో జరిగిన వేలంపాటలో చండూరి నరేష్ వినాయకుడి లడ్డూను రూ. 77,116లకు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో యువసేన అధ్యక్షుడు బోల్లం యశ్పాల్‌గౌడ్, ప్రతినిధులు కిరణ్‌కుమార్, వరుణ్, అవినాష్, తరుణ్‌సింగ్ ఠాకూర్, రాజేష్, సంప్రీత్, విష్ణు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ గణేశ్‌నగర్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను వేలం పాటలతో రూ. 1 లక్ష 53 వేలకు పడమటి శ్రీనివాస్‌రెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనుపమాసుప్రసేనారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.